



పాలిథిన్‌పై అవగాహన కల్పిస్తున్న 32వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

- పర్యావరణానికి ముప్పు తెస్తున్న ప్లాస్టిక్
- జనవరి 1 నుంచి నిషేధానికి జీవీఎంసీ సిద్ధం
- 45 రోజులు అవగాహన కార్యక్రమాలు

పా లిథిన్.. యిజన్

పాలిథిన్‌తో దొరికితే జరిమానా ఇలా..

విభాగాలు	మొదటి సారి	రెండోసారి	మూడో సారి
వ్యక్తిగతంగా	రూ.500	రూ.1000	రూ.2000
సంస్థలు	రూ.5000	రూ.10000	రూ.20,000
రిటైలర్లు, వీధి దుకాణదారులు	రూ.2000	రూ.5000	రూ.10,000
తయారీ సంస్థలు	రూ.5000	రూ.10,000	రూ.20,000

ఖాళీ

చేతుల్లో వెళ్లి పాలిథిన్ సంచి నిండా సరకులు తెచ్చుకునే రోజులివి. గతంలో బజారుకు వెళ్తే చక్కగా గుడ్డ సంచో, నార బ్యాగో పట్టుకెళ్లేవాళ్లం. కావలసిన సరకులు తెచ్చుకునే వాళ్లం. అయితే పాలిథిన్ బ్యాగులు, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ సంచులు మార్కెట్లలో వెల్లువెత్తాక పాత.. సంప్రదాయకమైన చేతి సంచులు కనుమరుగు అయిపోయాయి. పాలిథిన్ సంచుల సంస్కృతి రాజ్యమేలుతోంది. అవన్నీ ఎక్కడికి వెళ్తున్నాయి? ఏమైపోతున్నాయి? మట్టిలో.. నీళ్లలో.. సముద్రంలో.. కొండల్లో.. గుట్టల్లో ఎక్కడ పడితే అక్కడ కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. ఆ వ్యర్థాలు భూమిలోకి చేరటంతో భూమి తన ఉనికిని కోల్పోతుంది. పశువులు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయి. సముద్రంలో జలచరాలు పాలథిన్ సంచులను తిని ప్రాణాలు కోల్పోతున్నాయి. భూమి లోపల పాలథిన్ పేరుకుపోవటంతో భూమి ఉష్ణోగ్రత పెరిగి మానవాళికి పెనుముప్పుగా మారింది. దీనిని తక్షణమే ప్రతి ఒక్కరు బాధ్యతగా విడనాడాల్సిన అవసరం ఉంది. బజారుకు వెళ్లినా, ఎక్కడికి వెళ్లినా గుడ్డ సంచులు వాడుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం.

పాలిథిన్ కవర్లతో దొరికితే విధించే జరిమానాలు (రూపాయల్లో)

- వ్యక్తిగతంగా రూ.5,000
- పరిశ్రమలకు రూ.25,000

అల్లిపురం: జనవరి 1వ తేదీ నుంచి ఒకసారి వాడి పారేసిన ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం విధించేందుకు జీవీఎంసీ సన్నద్ధమవుతోంది. ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ కత్తులు, స్పూన్లు, స్ట్రాలు, స్వీట్ బాక్సులు, వంద మైక్రాన్లలోపు ఉండే ప్లాస్టిక్ తదితర వస్తువులపై నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తామని అధికారులు చెబుతున్నారు. నగరంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్న పరిస్థితుల్లో భవిష్యత్తులో ఎలాంటి ముప్పు రాకూడదంటే ప్లాస్టిక్ నిషేధం తక్షణ అవసరమని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు.

క్షేత్రస్థాయిలో విఫలం..

ప్లాస్టిక్ నిషేధంపై గతంలో అనేక మార్లు అధికారులు ప్రకటనలు చేసినా క్షేత్రస్థాయిలో అమలు శూన్యమనే చెప్పవచ్చు. అధికారులు నామమాత్రపు తనిఖీలు చేపట్టేవారనే ఆరోపణలు ఉన్నాయి. అరకొర జరిమానాలు వేసి చేతులు దులుపేసుకున్నారనే అపవాదు వారిపై పడింది. ప్లాస్టిక్ వాడకం యథేచ్ఛగా సాగుతుండటంతో ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. మురుగునీటి కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు ప్రవాహానికి అడ్డు తగులుతున్నాయి.

అవగాహనా ర్యాలీలు..

జీవీఎంసీ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు ప్లాస్టిక్ నిషేధంపై వార్డుల్లో అవగాహన ర్యాలీలు చేపడుతున్నారు. కరపత్రాల ద్వారా ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని వ్యాపారులు, వినియోగదారులకు చెబుతున్నారు. గుడ్డ సంచులు, జ్యూట్ బ్యాగులు వినియోగించాలని అవగాహన కల్పిస్తున్నారు.



మార్కెట్లను ముంచెత్తుతూ..

రైతుబజార్లు, కూరగాయల దుకాణాలు, కిరాణా షాపులు, మాంసం కొట్లు, టిఫిన్ బండ్లు, పండ్ల దుకాణాల్లో ఎక్కడ చూసినా పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ కప్పులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో పూర్ణామార్కెట్, కురుపాం మార్కెట్, రామకృష్ణా రైతుమార్కెట్, హోల్‌సేల్ మార్కెట్లలో ప్లాస్టిక్ వినియోగం అధికంగా కనిపిస్తుంది. వాటికి తోడు వాటర్ బాటిళ్ల వాడకం కూడా పెరగటంతో కాలువల్లో, రోడ్ల పైన ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. నియోజకవర్గంలో ప్రతిరోజు 80 నుంచి 100 టన్నుల వరకు చెత్త టౌన్ కొత్తరోడ్డు యార్డుకు వస్తుంటుంది. అందులో 30 టన్నుల మేర ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి.

ప్లాస్టిక్ వినియోగించినా, అమ్మినా చర్యలు..



నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు అమ్మడం చట్టరీత్యా నేరం. జనవరి 1వ తేదీ నుంచి ప్లాస్టిక్‌ను జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు సంపూర్ణంగా నిషేధిస్తున్నాం. షాపుల్లో ప్లాస్టిక్ విక్రయాలు జరిపినా, వినియోగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ నెల 15వ తేదీ నుంచి వ్యాపారులు, ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు కూడా మార్కెట్‌కు వెళ్లినప్పుడు జ్యూట్ బ్యాగులు, గుడ్డ సంచులు విధిగా తీసుకెళ్లాలి. ప్లాస్టిక్ నిషేధానికి అధికారులు, వ్యాపారులతో సహకరించాలి.

– ఎం.మల్లయ్యనాయుడు, జోన్–4, జోనల్ కమిషనర్

క్లుప్తంగా

ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట: విధి నిర్వహణలో తలమునకలై ఉండే ఉద్యోగులు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అన్నారు. శనివారం జెడ్పీ ఆవరణలో ఉద్యోగుల కోసం రెండు ప్రైవేటు ఆస్పత్రుల సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ప్రతి ఉద్యోగి తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, గుండె పరీక్షలు నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కూడా వివిధ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) పి.నారాయణమూర్తి, ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, పరిపాలనాధికారి (ప్లానింగ్) పీవీవీఎస్ మూర్తి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి చేరిన కాన్పూర్ వాసి



శ్రీకిషన్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులు

సీతమ్మధార: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ దగ్గర కమలానగర్‌కు చెందిన శ్రీకిషన్ ఎనిమిది సంవత్సరాల నుండి మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. అతను ఒక రైతు బిడ్డ, వ్యవసాయం చేసేవాడు. వ్యాధి పట్ల అవగాహన లేక తండ్రి మంత్రగాడిని ఆశ్రయించడంతో శ్రీ కిషన్ ఆరోగ్యం మరింత క్షీణించింది. దీంతో 5 నెలల క్రితం ఇంట్లో నుండి పరారయ్యాడు. ఇతని భార్య ఇంకొకరిని పెళ్లి చేసుకుంది. విశాఖ రైల్వే స్టేషన్లో పట్టుకున్న శ్రీ కిషన్‌కు శ్రద్ధా ఫౌండేషన్ చికిత్స అందించడంతో అతను కోలుకున్నాడు. తన చిరునామా చెప్పడంతో వైజాగ్ నుండి నేరుగా తీసుకెళ్లి తల్లిదండ్రులకు అప్పగించారు.

యూజీడీ కార్మికులను ఆప్కాస్‌లో విలీనం చేయాలి

అల్లిపురం: యూజీడీ అవుట్ సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్‌లో విలీనం చేసి, జీవో 36 ప్రకారం రూ.21 వేలు, రూ.24,500 వేతనం చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష, కార్యదర్శులు టి.నూకరాజు, ఉరుకూటి రాజు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం జగదాంబ దరి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, ఈ. ఆదినారాయణ, జీఆర్ నాయుడు, గొలగాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జబ్బర్‌తోటలో 24 గంటల వైద్య సేవలు



డయేరియా రోగితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు శనివారం జబ్బర్‌తోట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, డయేరియా బాధితులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. 24 గంటల పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచామన్నారు. ఆ ఏరియాలో ప్రతి ఇల్లు సందర్శించి డయేరియా వ్యాధిగ్రస్తులను గుర్తించాలని ఆదేశించామన్నారు. ఆశ కార్యకర్త, ఏఎన్‌ఎం డయేరియా కేసులు వచ్చిన వెంటనే తమ వైద్యాధికారికి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి తెలియచేయాలన్నారు. డాక్టర్ జగదీష్ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలాజీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో ప్రజల్లోకి జగనన్న

కార్యకర్త మందుల ఖర్చుకు వాసుపల్లి ఆర్థిక సాయం



పార్టీ కార్యకర్తకు రూ.10 వేలు సహాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: త్వరలో జగనన్న ప్రజల్లోకి వస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. జగన్ మోహన్‌రెడ్డి చేసిన మేలు ఇప్పుడిప్పుడే ప్రజలకు అర్థమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో ఏ ఒక్కటి అమలు చేయలేకపోతుందని అన్నారు. మహిళలకు ఉచిత గ్యాస్ సబ్సిడీ అంటూ ప్రచారాలు చేసుకుని మభ్య పెట్టారన్నారు. ఏమీ చేయలేక ప్రజలు జగనన్న కోసమే మళ్లీ ఎదురు చూస్తున్నారన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన పార్టీ కార్యకర్త, 37వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నొల్లు పోతుస్వామి కుమారుడు నొల్లు చంటికి ఆర్థిక సహకారం అందజేశారు. నొల్లు చంటి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలయ్యాడు. దీంతో ఉపాధి కోల్పోయి ఇంట్లోనే ఉంటున్న ఆయనకు వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట 37వ వార్డు కార్పొరేటర్ జానకిరామ్, పార్టీ నాయకులు సర్వేశ్వరరెడ్డి, పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, ముత్తాబత్తుల రమేష్, సనపల రవీంద్రభరత్, ముజీబ్‌ఖాన్, వేణు పాల్గొన్నారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు

అల్లిపురం: అల్లిపురం వెంకటేశ్వరమెట్టపై వేంచేసిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో డిసెంబర్ 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతాయని ఆలయ ఈవో జి.వి.రమాబాయి తెలిపారు. స్వామి వారికి ప్రతిరోజు సుప్రభాత సేవ, ఆరాధన, ధనుర్మాస అర్చనలు, తిరుప్పావై వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. డిసెంబర్ 16వ తేదీ ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు మొదలవుతాయని, ఈ సందర్భంగా నెలగంట పెడతారని చెప్పారు.

గుర్తు తెలియని యువకుడి మృతి

అల్లిపురం: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి గోకుల్ థియేటర్ వద్ద గుర్తు తెలియని యువకుడు ఈ నెల 29వ తేదీ రాత్రి మృతి చెంది ఉన్నట్లు సీఐ బి.తిరుమలరావు తెలిపారు. మృతి చెందిన యువకుడు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు వయస్సు కలిగి, 5 అడుగుల ఎత్తు కలిగి ఉన్నాడని పేర్కొన్నారు. ఛామనచాయ, నీలం రంగు నెక్, హాఫ్ హ్యాండ్స్ టీ షర్టు ధరించి, సిమెంట్ రంగు త్రీ ఫోర్తు షార్ట్ వేసుకుని ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 0891-2783672, 9440069465 ఫోన్ నంబర్లలో తెలపాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



గొల్లవీధిలో మహిళలతో మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. శనివారం ఆయన జోన్ పరిధిలో బబ్బర్‌తోట, గొల్లవీధి ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడ ప్రజలు తాగుతున్న మంచి నీటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగునీటిలో ఎటువంటి కలుషితం లేదన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇళ్లలో నీళ్లు నిల్వ ఉంచకూడదన్నారు. పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరిబొండాలు ఇంటి ఆవరణలో ఉండకుండా చూసుకోవాలన్నారు. ఫ్రిజ్ వెనుక ఎప్పటికప్పుడు నీటిని శుభ్రపరుచుకోవాలన్నారు. జబ్బర్‌తోటలో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలని ఏఎంహెచ్‌వో కృష్ణంరాజును ఆదేశించారు. అనంతరం ఆయన వార్డులో కాలువలు, రహదారులను పరిశీలించారు. చెత్త సేకరణపై ఆరా తీశారు. పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్త తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, తాగునీటి సరఫరా విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనన ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు సరి చేయండి

మహారాణిపేట: జనన ధ్రువీకరణ పత్రాల్లో తప్పులను త్వరితగతిన సరి చేయకుంటే అది బాలల హక్కుల ఉల్లంఘనగానే పరిగణించాల్సి వస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. వన్‌టౌన్‌లోని విక్టోరియా ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో శనివారం ఆస్పత్రిలో జన్మించిన పిల్లల జన్మదిన ధ్రువీకరణ పత్రాల్లో తప్పుల నమోదు, వాటిని సరి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష, వైద్యులు డాక్టర్ ఉప్పాడ జీవన్ సంతోష్, డాక్టర్ గీతావందన, డాక్టర్ పి.శైలజ, డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ నుంచి ఈ ఏడాది జనవరి 1 నుంచి నేటి వరకు ఆస్పత్రిలో ఎంత మంది ఆడ, మగ పిల్లలు జన్మించినదీ అడిగి తెలుసుకున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఉష మాట్లాడుతూ పిల్లలు జన్మించిన వెంటనే తప్పులు నమోదు కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్. రాధ, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఎం.వి.రమణ కుమారి, జి.శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.హెచ్.లక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ విభాగం పి.ఒ.ఎన్.ఐ.సి.బి.మమత, అనీజా, ఆనంద్, శకుంతల పాల్గొన్నారు.

రిటైర్డ్ హెడ్ నర్సుకు సత్కారం

మహారాణిపేట: కేజీహెచ్‌లో 39 ఏళ్ల పాటు నర్సుగా పని చేసిన హెడ్ నర్సు జ్ఞానాంబ పదవీ విరమణ సందర్భంగా శనివారం సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ సన్మానం చేశారు. ఆమె సేవలను కొనియాడారు. జ్ఞానాంబను క్లాస్‌మేట్లు, మిత్రులు, పలువురు తోటి హెడ్ నర్సులు, స్టాఫ్ నర్స్ కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ పి.ఎస్.అప్పారావు, గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్లు రమణమ్మ, కల్పనా మాళి, ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలు టి. గంగాభవానీ, కార్యదర్శి జి.వి.ఎస్. వరలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ ఎం. ఇందిర, ఈసీ మెంబర్లు గౌరీ, మెహర్ శాంతి, వినీల, పద్మ తదితరులు పాల్గొన్నారు.



హెడ్ నర్సు జ్ఞానాంబను సన్మానిస్తున్న డాక్టర్ శివానంద్, నర్సులు తదితరులు

సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

కంచరపాలెం: సైబర్ నేరాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని సీనియర్ న్యాయవాదులు కె. జయ, కె.ప్రేమానందరావు పేర్కొన్నారు. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ మార్గదర్శకాలకు ప్రతిస్పందనగా శనివారం 'సైబర్ బెదిరింపు–సోషల్ మీడియా దుర్వినియోగం'పై జరిగిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే మహిళల పట్ల సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సదస్సు సమన్వయకర్త పి.కె.జయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ అధికారి, ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, కె.ప్రమీల, జె.నిర్మల, దీప్తి, కోటేశ్వరరావు, జ్యోతి, పావని తదితరులు పాల్గొన్నారు.

'వేడుక' చిత్ర పోస్టర్ ఆవిష్కరణ



వేడుక చిత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

అల్లిపురం: ఉత్తమ సాంకేతిక ప్రమాణాలతో ఉంగరాల ఈశ్వర్ దర్శకత్వంలో నిర్మించిన వేడుక చిత్ర పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆవిష్కరించారు. శనివారం ఆశీలుమెట్ట దరి ఆయన క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చిత్ర కథా రచయిత, పాటలు, స్క్రీన్‌ప్లే రచయిత అయిన డాక్టర్ బి.రమేష్‌బాబు (న్యూరో సైకియాటిస్ట్)తో కలిసి ఆవిష్కరణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నటులు రవితేజ, ప్రొడక్షన్ మేనేజర్, అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్, ఆర్.ఎస్.ఎంటర్‌ప్రైజెస్ అధినేత కోన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు మానసిక వైద్యుల సదస్సు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ మానసిక వైద్యుల సంఘం తరపున అంకోశా ఆడిటోరియంలో రెండు రోజుల పాటు సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎం.ఎస్.రాజు తెలిపారు. శనివారం కేజీహెచ్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గాయత్రీ విద్యా పరిషత్ ఆధ్వర్యంలో పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఆదివారం జరిగే సదస్సుకు ముఖ్య అతిథిగా విశాఖ ఎంపీ భరత్ హాజరవుతారన్నారు. మానసిక వైద్యంలో వస్తున్న నూతన పోకడలు, మెదడులో జరుగుతున్న మార్పుల పైన సదస్సులో చర్చిస్తామని కౌసల్యా కౌన్సెలింగ్ సెంటర్ నిర్దేశకుడు, సదస్సు నిర్వాహకుడు, కార్యదర్శి డాక్టర్ ఎన్.జి. నిహాల్ తెలిపారు. ఈ సందర్భంగా బ్రోచర్ విడుదల చేశారు. ఏపీ మానసిక వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.వి.ఎస్. మూర్తి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఐ. శరత్ చంద్ర, ఉపాధ్యక్షుడు డాక్టర్ లోకేష్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ కిషోర్, ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

అల్లిపురం: ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) స్కిల్ హబ్ ఆధ్వర్యంలో విశాఖ ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో మహిళలకు ఉచిత కంప్యూటర్ కోర్సులో ఒక నెల శిక్షణ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. టెన్త్ లేదా ఇంటర్ అర్హత కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు స్వీకరణకు డిసెంబర్ 3 ఆఖరు తేదీ అని, మరిన్ని వివరాలకు 9121676360 నంబరులో సంప్రదించాలని కోరారు.

అదానీ సంస్థతో చేసుకున్న ఒప్పందాలన్నీ అక్రమమే

- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

అల్లిపురం: రాష్ట్రంలో గౌతం అదానీ సంస్థతో చేసుకున్న ఒప్పందాలన్నీ రాష్ట్ర రాజకీయ పార్టీలకు ముడుపులు చెల్లించి చేసుకున్నవేనని, ఇవి అక్రమ ఒప్పందాలేనని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు ఆరోపించారు. సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'అదానీ ముడుపులు, విద్యుత్ ఒప్పందాలు, రాష్ట్ర రాజకీయ పార్టీల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో వారు పాల్గొన్నారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చాక భారతదేశ సంపదను, వనరులను అదానీకి దోచి పెట్టారన్నారు. అదానీకి మోదీ రాష్ట్ర సంపదను దోచిపెడుతున్నా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నోరు మెదపటం లేదన్నారు. విశాఖకు, రాష్ట్రానికి తీవ్ర నష్టం కలిగించే అదానీ గ్రూపుతో చేసుకున్న ఒప్పందాలన్నీ రద్దు చేయాలని, గంగవరం పోర్టును స్టీల్‌ప్లాంట్‌కు అప్పగించాలని, డేటా సెంటర్, సాండ్ మైనింగ్‌ను, సౌరవిద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బాలల హక్కులకు ప్రాధాన్యం కల్పించండి



మాట్లాడుతున్న గొండు సీతారామ్

మహారాణిపేట: డిసెంబర్ 2 నుంచి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మ వారి దేవస్థానంలో నిర్వహించనున్న మార్గశిర మాసోత్సవాలకు విచ్చేసే వేలాది మంది బాలల రక్షణకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. శనివారం బురుజుపేటలోని అమ్మవారి ఆలయ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ ఈవో కె.శోభారాణి, దేవాలయ ఈఈ సీహెచ్ వెంకటరమణ నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. దర్శనం సమయంలో తప్పిపోయిన పిల్లలను వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చేందుకు 1098 చైల్డ్ లైన్, స్త్రీ,శిశు సంక్షేమ, పోలీసు శాఖల సమన్వయంతో సమావేశాలు ఏర్పాటు పైన ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఈవో కె.శోభారాణి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణ, ఏఈలు సూర్యారావు, సూరిబాబు, పీఆర్‌వో ప్రసాద్, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఎం.వి.రమణ కుమారి, శ్రీలత, కార్మిక శాఖాధికారి ఎస్. పద్మావతి, మండల విద్యాశాఖాధికారులు పైడపు నాయుడు, పుష్యరాగం, బాలల సంరక్షణ అధికారి లక్ష్మి, విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి పద్మావతి, జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధులు మమత, ఆనంద్, అనీజా, శకుంతల పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

అల్లిపురం: విశాఖ కో ఆపరేటివ్ డెయిరీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ తెలిపింది. శనివారం జరిగిన సమావేశంలో విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పాల్గొని మాట్లాడారు. విశాఖ డెయిరీలో గత 30 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికులకు ఏ విధమైన చట్టబద్ధమైన హక్కులు అమలు కావడం లేదన్నారు. దీంతో ఉద్యోగులు 23న సమ్మె నోటీసు ఇచ్చారని, సమస్యలు పరిష్కారం కాకపోతే డిసెంబర్ 6 నుంచి సమ్మెకు సిద్ధం కావాలన్నారు. ఎస్.రమణ, రాజేంద్రప్రసాద్, నారాయణ, బసవరాజు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణ వాగ్దానం నిలబెట్టుకోవాలి



దీక్షలో పాల్గొన్న ఐద్వా నాయకులు

సీతమ్మధార: ఎన్నికల్లో ఇచ్చిన స్టీల్‌ప్లాంట్ రక్షణ వాగ్దానాన్ని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని ఐద్వా నాయకులు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరాహార దీక్షలో పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణకు చేస్తున్న పోరాటం 1342వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తుందన్నారు. విశాఖ ప్రజలు, కార్మికులు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే స్టీల్‌ప్లాంట్‌ని కాపాడతారు అని భావించారు అన్నారు. అయితే ఇంత వరకు స్టీల్‌ప్లాంట్ రక్షణకు ప్రధానితో ఒక్కసారి కూడా ఆయన మాట్లాడినట్లు లేదన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, కె. మణి, బి.భారతి, కె.కుమారి, ఆర్. విమల, బి.మమత, ఎం. నిర్మల, కె.సంతోషం, జి. మణి, కె.సత్యవతి, ఎం. నిర్మల, ఆర్. పార్వతి, ఆర్. ముత్యాలమ్మ, పి. మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.